ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
గురువారం 26 సెప్టెంబరు 2024

వరదలకు కొట్టుకుపోవడంతో 293 మీటర్లకు తగ్గిపోయిన బ్యారేజీ మట్టి ఆనకట్ట



ప్రశ్నార్థకంగా కేసీ ఆధునికీకరణ

రూ.51 కోట్లు ఇవ్వలేక.. రూ.513 కోట్లు వదిలేశారు..!

- 'సింప్' కింద సుంకేసుల డ్యాం, కేసీ కెనాల్ ఆధునికీకరణకు కేంద్రం ఆమోదం
- రాష్ట్రం వాటా పది శాతం ఇవ్వలేని గత వైసీపీ ప్రభుత్వం
- 15 ఏళ్లుగా శాశ్వత మరమ్మతులకు నోచుకోని వైనం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబును ఒప్పించాలి

కర్నూలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల జలవరదాయని కేసీ కాలువ. తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీ నుంచి ఈ కాలువకు నీరు విడుదలవుతుంది. 2009 భారీ వరదలకు బ్యారేజీ సహా కాలువ పూర్తిగా దెబ్బతింది. 15 ఏళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో పాలకులు నెట్టుకొస్తున్నారు. శాశ్వత మరమ్మతులకు సపోర్ట్ ఫర్ ఇరిగేషన్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ (ఎస్ఐఎంపీ-సింప్)లో భాగంగా రూ.513 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్రం వాటా పది శాతం నిధులు ఇవ్వడానికి గత వైసీపీ ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. నాటి సీఎం జగన్ నిర్లక్ష్యం కారణంగా కేంద్ర ప్రభుత్వం ఇస్తామన్నా నిధులు రాకుండా పోయాయి. సీమ జిల్లాల్లో కీలకమైన సుంకేసులు డ్యాం భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల వర్షాలకు డ్యాం మట్టికట్ట కుంగిపోతే ఎర్రమట్టి వేసి సరిపుచ్చారు. దీని మీద టీడీపీ కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించాలి. సీఎం చంద్రబాబును ఒప్పించి కేంద్రం వద్ద ఆగిపోయిన 'సింప్' నిధులు రాబట్టాలి. సుంకేసులు డ్యాం సహా కేసీ కాలువ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టాలని రైతులు కోరుతున్నారు.



సుంకేసుల బ్యారేజీ

కర్నూలు జిల్లా సుంకేసుల, తెలంగాణ రాష్ట్రం మండల కేంద్రం రాజోలి గ్రామాల మధ్య తుంగభద్ర నదిపై సుంకేసులు బ్యారేజీ నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప కాలువ (కేసీ కెనాల్) తవ్వారు. 155 ఏళ్ల క్రితం నాటి బ్రిటీష్ పాలకులు తుంగభద్ర-పెన్నా నదులను అనుసంధానం చేస్తూ నావిగేషన్ (జల రవాణా) లక్ష్యంగా 1863-1870 మధ్యలో కేసీ కాలువను నిర్మించారు. భారతదేశంలోనే ప్రప్రథమ మానవ నిర్మిత ట్రాన్స్-బేసిన్ రవాణా ప్రాజెక్టు ఇది. 1933లో నావిగేషన్ రద్దు చేసి సాగునీటి ప్రాజెక్టుగా మార్చారు. రెండు నదులను అనుసంధానం (అంతర్-లింకింగ్) చేయడం ఇదే ప్రథమం. సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువ 0.00 నుంచి 234.64 కిలోమీటర్ల వరకు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో, 234.64 కి.మీల నుంచి 305.65 కిలోమీటర్ల వరకు (71.01 కి.మీలు) కడప జిల్లాలో ప్రవహిస్తుంది. కేడబ్ల్యూడీటీ అవార్డు (జస్టిస్ బచావత్ అవార్డు)-1 ప్రకారం 31.90 టీఎంసీలు నికర జలాలు కేటాయించారు. అందులో 10 టీఎంసీలు తుంగభద్ర డ్యాం నుంచి తీసుకోవాల్సి ఉంది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1,73,627 ఎకరాలు, కడప జిల్లాలో 92,001 ఎకరాలు కలిపి 2,65,628 ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరం సహా పలు పట్టణాలు, పలు గ్రామాలకు తాగునీరు అందుతుంది. 259 గ్రామాలకు జల ప్రయోజనాలు అందిస్తున్న ఈ కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు. సీమ కరువు పల్లెరైతుల కన్నీళ్లు తుడిచే సుంకేసుల బ్యారేజీ, కేసీ కెనాల్ చరిత్ర ఇది. 2009లో తుంగభద్ర నదికి దాదాపు 9 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చింది. వరద ఉధృతికి సుంకేసులు బ్యారేజీ మట్టి ఆనకట్ట కొట్టుకుపోయింది. ప్రాజెక్టు సహా కేసీ కాలువ ఛిద్రమైంది. నాటి నుంచి తాత్కాలిక మరమ్మతులతో నెట్టుకొట్టుస్తున్నారే తప్ప పాలకులు శాశ్వత మరమ్మతులపై దృష్టి సారించలేదు.



లీకేజీ అవుతున్న కేసీ కాలువ గేట్లు

కేంద్రం నిధులు ఇస్తామన్నా..!

దేశంలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ లక్ష్యంగా ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) సాంకేతిక సహకారంతో సపోర్ట్ ఫర్ ఇరిగేషన్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ (ఎస్ఐఎంపీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చింది. ఈ నిధులు సద్వినియోగం చేసుకొని 2009 నాటి వరదలకు ఛిద్రమైన సుంకేసుల బ్యారేజీ బలోపేతం, డ్యాం ఇరువైపుల మట్టి ఆనకట్ట 293 మీటర్ల నుంచి 299 మీటర్ల ఎత్తుకు పెంచడం, కేసీ కాలువ సీసీ లైనింగ్, వివిధ ప్రాంతాల్లో సైడ్ వాల్స్ నిర్మాణం.. వంటి పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్, కేసీ కెనాల్ డివిజన్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి రూ.513.40 కోట్లు నిధులు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపారు. ఈ డీపీఆర్‌ను పరిశీలించిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించింది. ఎస్ఐఎంపీ ఫేజ్-1 కింద రాష్ట్రంలో ఎంపికైన ఏకైక ప్రాజెక్టు ఇది. కేసీ కెనాల్ ప్రాజెక్టు ఆధునికీకరణకు ఫేజ్ 2-4 సంబంధించి తదుపరి కార్యకలాపాలు కొనసాగించడానికి, ప్రతిపాదిత నిధులు సమకూర్చడం, ఫైనాన్స్ ప్లానింగ్ దృష్ట్యా, ఆర్థిక శాఖను సంప్రదించి 2021 నవంబరు 30లోగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలంటూ 2021 నవంబరు 11న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. 'సింప్' నిధులు వస్తాయని, సుంకేసులు బ్యారేజీ, కేసీ కాలువ బాగుపడుతుందని రైతులు ఆశించారు.

సుంకేసులు బ్యారేజీ, కేసీ కాలువ ఆధునికీకరణకు ఎస్ఐఎంపీ కింద పంపిణీ ప్రతిపాదన అంచనాలు

చేపట్టాల్సి పనుల వివరాలు	అంచనా రూ.కోట్లల్లో
● సుంకేసుల బ్యారేజీ బలోపేతం, మట్టికట్ట ఎత్తు 293 నుంచి 299 మీటర్లకు పెంపు	63.00
● 0/00 నుంచి 25 కి.మీల వరకు కేసీ కెనాల్ లైనింగ్, డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ అభివృద్ధి	239.00
● వెలుగోడు మండలం వెల్పనూరు వద్ద 133 నుంచి 144 కి.మీల వరకు సైడ్ కాల్	29.50
● గడివేముల మండలం తుడిచర్ల, కొర్రపోలూరు, చిన్నెకూరు, కేతః ఛానల్స్ రిపేరి, సైడ్ వాల్	105.64
● వేంపెంట, పెంచికపల్లి, మాధవరం, వెల్పనూరు, మద్దూరు మేజర్స్ పునర్నిర్మాణం, సైడ్ వాల్స్	22.26
● కర్నూలు మండలం ప్రాతకోట వద్ద 91 నుంచి 92 కి.మీల ప్రధాన కేసీ కాలువ లైనింగ్	2.80
● కేసీ కాలువ 96 నుంచి 96.400 కి.మీలు, 99.60 నుంచి 101 కి.మీల వరకు సీసీ లైనింగ్	4.20
● కేసీ కెనాల్ 231.202 నుంచి 234.602 కి.మీల వరకు సీసీ లైనింగ్, మరమ్మతులు	15.00
● కేసీ కెనాల్ 189 నుంచి 231.202 కి.మీల వరకు శాశ్వత మరమ్మతులు	32.00
మొత్తం	513.40

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

కేసీ కెనాల్ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఎంపీ కింద నిధులు ఇవ్వాలంటే ప్రతిపాదిత అంచనా విలువలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 10 శాతం చెల్లించాల్సి ఉంది. అంటే.. అంచనా విలువ రూ.513.40 కోట్లకు పది శాతం రూ.51.34 కోట్లు ఏపీ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఆ నిధులు ఇవ్వడానికి గత సీఎం జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం ముందుకు రాకపోగా.. సమ్మతి తెలుపుతూ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాయకపోవడంతో నిధులు ఆగిపోయాయని జలవనరుల శాఖ అధికారులు అంటున్నారు. గత సీఎం జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రూ.51.34 కోట్లు ఇవ్వకపోవడంతో ఎస్ఐఎంపీ కింద రావాల్సిన రూ.513.40 కోట్లు నిధులు కోల్పోవాల్సి వచ్చింది. తద్వారా రాయలసీమ జిల్లాల్లో కీలకమైన కేసీ కెనాల్, సుంకేసుల బ్యారేజీ ఆధునికీకరణ ప్రశ్నార్థకమైంది. నాటి వైసీపీ పాలకులు కనీస శ్రద్ధ పెట్టి ఉంటే ఈపాటికే ఆధునికీకరణ పనులు పూర్తి అయ్యేవని నిపుణులు పేర్కొంటున్నారు.

కూటమి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి!

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం.. బాధ్యతారాహిత్యం కారణంగా కేంద్రం ఇస్తామన్న రూ.513.40 కోట్లు ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి సహా కేసీ కాలువ పరివాహక నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఈ నిధులపై దృష్టి సారించాలి. సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను ఒప్పించి కేసీ కెనాల్ ఆధునికీకరణకు ఆగిపోయిన ఎస్ఐఎంపీ నిధులు ఇవ్వాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాయించడంతో పాటు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కేసీ కాలువ దుస్థితి ఇది



ఈనెల 1న సుంకేసుల డ్యాం క్రస్ట్‌గేట్లకు సమీపంలోనే కుంగిపోయిన మట్టికట్టను ఎర్రమట్టితో పూడ్చివేస్తున్న ఇంజనీర్లు

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలి

- మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలి
- ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు, సెప్టెంబరు 25: విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నిబంధనలు, ఈవ్ టీజింగ్, యాంటి ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలని ఎస్పీ జి.బిందు మాధవ్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని కళాశాలల కరస్పాండెంట్లు, కళాశాల ప్రిన్సిపాల్స్, హెచ్‌వోడీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకునేవిధంగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం తీసుకునే చర్యల గురించి వివరించాలని చెప్పారు. సమస్యలు ఎదురైనప్పుడు యువత ధైర్యంతో ఎదుర్కోవాలని, ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదనే విషయాన్ని విద్యార్థుల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాల క్రయ విక్రయాలు జరిపినా లేదా సేవించినా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. అలాగే అతిగా సెల్‌ఫోన్ వినియోగం, సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం వంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండేలా చూడాలన్నారు. అలాగే సోషల్ మీడియా వేధింపులపై విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలులోని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఖాజావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

'స్వచ్ఛతా హి సేవా'లో భాగంకండి

కల్లూరు, సెప్టెంబరు 25: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. బుధవారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలోని స్వచ్ఛతా హి సేవా, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో వ్యక్తిగతంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక నిర్దిష్టమైన స్థలాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడే చెత్త వేసేలా చూడాలన్నారు. నిరుపయోగంగా ఉన్న చెత్తను క్లాప్‌మిత్రల ద్వారా షెడ్‌కు తరలించి రీ సైక్లింగ్ స్తారని తెలిపారు. ప్రతి నెలా ఒకటిన పింఛన్ అందజేస్తున్నామని, పెన్షన్ పంపిణీలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అదేవిధంగా స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని కలెక్టర్ వివరించారు. సమగ్రమైన అభివృద్ధి ప్రణాళికను అమలు చేయడం ద్వారా 2047 నాటికి ప్రపంచ స్థాయిలో పోటీ తట్టుకునే విధంగా గ్లోబల్ సిటిజన్స్‌గా మారే అవకాశం ఉందన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌కు సంబంధించి ఫీడ్‌బ్యాక్ ఫార్మ్ ఇచ్చామని, అందులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే 11 ప్రశ్నలు వస్తాయని, వాటి మీద తమ అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. అంతకు ముందు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై గ్రామస్తులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం షెడ్‌మిత్రా, క్లాప్‌మిత్రలను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సర్పంచ్ భూపాల్‌రెడ్డి, ఎంపీపీ శారద, జడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు ఆంజనేయులు టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా

ఓటు లేకున్నా గెలిపించుకున్నాం

- మీనాక్షి నాయుడుని చూసి ప్రజలు ఓటేశారు
- ఎమ్మెల్యేపై ప్రకాష్ జైన్ తీవ్ర విమర్శలు


ఆదోని, సెప్టెంబరు 25 : 'ఆదోనిలో మీకు ఓటు కూడా లేదు.. మా మీనాక్షి నాయుడు, మా మాట విని ప్రజలందరూ ఓటు వేసి గెలిపించారు' అని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు ప్రకాష్ జైన్ అన్నారు. మా మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో కలిసి ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి పెద్ద వాళ్లే ప్రజలకు సేవకుడు అని చెబుతున్నారని, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఎవర్నో ఒకరిని పక్కనే పెట్టుకొని తిరుగుతున్నారే తప్ప పనులు మాత్రం కావడం లేదని అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే పార్థసారథి ఇంటికి వెళితే రెండు గంటల పాటు బయటే ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్థసారథిని చూసి ప్రజలు ఓటు వేయ లేదని, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడును, తన ను చూసి 18 వేల పైచిలుకు మెజార్టీతో గెలిపించారని తెలిపారు. బీజేపీ కోసం పదేళ్ల నుంచి కష్టపడుతున్నానని, అధిష్ఠానం టికెట్ పార్థసారథికి కేటాయించడంతో ఆయన గెలుపు కోసం కృషి చేశామని చెప్పారు. వంద రోజుల్లో ఎమ్మెల్యే ఆదోని నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు తెలుసన్నారు. ఒంటెద్దు పోకడ పనికిరాదని, చెప్పుడు మాటలు, మాయ మాటలు వినొద్దని సూచించారు. ఆదోని అభివృద్ధి కోసం మూడు పార్టీల నాయకులు ఒక్క తాటిపైకి వచ్చి పని చేస్తే ప్రజలు కూడా హర్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బసవరాజు, రంగన్న, రామస్వామి, అన్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాష్ జైన్

చంద్రబాబు పర్యటన రద్దు

కర్నూలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పత్తికొండ మండలం పుచ్చకాయలమడ పర్యటన మళ్లీ రద్దయింది. పత్తికొండ నియోజకవర్గంలో గురువారం జరిగే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు వస్తున్నారనే సమాచారం రావడంతో కలెక్టరు పి. రంజిత్‌బాషా ఏర్పాట్లపై సమీక్షించారు. పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, సిబ్బంది సైతం గ్రామానికి చేరుకున్నారు. భారీ జన సమీకరణ కోసం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ముఖ్య నాయకులతో మాట్లాడారు. ఇంతలోనే సీఎం చంద్రబాబు మరో కార్యక్రమంలో పాల్గొనాల్సి రావడం, వాతావరణం కూడా సహకరించకపోవడం వల్ల పర్యటన రద్దయిందని సీఎంవో ఆఫీసు నుంచి జిల్లా అధికారులకు సమాచారం వచ్చింది. సీఎం రావడం లేదని సాయంత్రం సమాచారం వచ్చిందని కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆంధ్రజ్యోతికి వివరించారు.



పుచ్చకాయలమడకు అచ్చిరాని సీఎం పర్యటన

ఆగస్టు 31న పింఛన్ల పంపిణీ చంద్రబాబు పుచ్చకాయలమాడకు రావాల్సి ఉండగా రద్దయింది. భారీ వర్షాల కారణంగా పుచ్చకాయలమడ నుంచి కార్యక్రమాన్ని మండల కేంద్రం ఓర్వకల్లుకు మార్చారు. తాజాగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి చంద్రబాబు వస్తారనుకుంటే రద్దయింది. దీంతో పుచ్చకాయలమడ గ్రామానికి సీఎం చంద్రబాబు పర్యటన అచ్చిరాలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి: కాంగ్రెస్



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్లేట్లు, గరిటెలు చేతబట్టి శబ్దాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్యే ఎం.సుధాకర్‌బాబు, కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానిబాషా, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎం.కాశీంవలి, రమేష్ యాదవ్, చిప్పగిరి లక్ష్మీనారాయణ మురళి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లపై నిగ్గు తేల్చండి!



- గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా జారీ
- రూ.కోట్ల ప్రజాధనం పక్కదారి
- సమగ్ర విచారణ చేయాలంటూ టౌన్ ప్లానింగ్ డైరెక్టరు ఆదేశాలు
- కర్నూలు నగర పాలక సంస్థలో 135 బాండ్లు జారీ
- మేయర్ బీవై రామయ్య బాధ్యతలు చేపట్టాకే వందకు పైగా
- నగర పాలక ప్రజాధనం దోచిపెట్టారనే ఆరోపణలు

కర్నూలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫెరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల జారీలో గత వైసీపీ ప్రభుత్వంలో భారీ ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అధికారం మాటున నిబంధనలకు తుంగలో కలిపేసి టీడీఆర్ పత్రాల రూపంలో అప్పటి వైసీపీ నాయకులు, వారి సిఫారసులతో బిల్డర్లు, రియల్ ఎస్టేటర్లకు ప్రజాధనం దోచిపెట్టారనే ఆరోణలు వెల్లువెత్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా టీడీఆర్ పత్రాల జారీ ద్వారా భారీ కుంభకోణం జరిగిందని టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. కర్నూలు నగర పాలక సంస్థ కూడా 135 బదిలీ చేయదగ్గ అభివృద్ధి హక్కులు (టీడీఆర్) బాండ్ల జారీ చేశారు. గత జగన్ ప్రభుత్వంలో అధికారం అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై టీడీఆర్ పత్రాలు జారీ చేసినట్లు సమాచారం. పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు టీడీఆర్ పత్రాలు, భవన నిర్మాణ దరఖాస్తులను టౌన్ ప్లానింగ్ అధికారులు ఆపేశారు. అయినప్పటికీ మున్సిపాలిటీ యంత్రాంగంలో మార్పు కనిపించడం లేదు. దీంతో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ టీడీఆర్ బాండ్ల జారీ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పత్రాలు ఎంత వరకు నిజాయితీగా జారీ చేశారు..? ఏ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయి..? నిగ్గు తేల్చడమే కాకుండా టీడీఆర్ ప్రక్రియ క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. నగర పాలక సంస్థ జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై సమగ్ర విచారణలో భాగంగా టీడీఆర్ జారీ చేసిన ఇంటి నెంబరు, సర్వే నంబరు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ హక్కుదారులు ఎవరు..? ఏ వ్యక్తి పేరిట జారీ చేశారు, ఆ వ్యక్తి నిజమైన హక్కుదారుడేనా?.. ఇలా పక్కా ఫార్మెట్ తయారు చేసి పూర్తి వివరాలతో సర్వే చేయాలంటూ రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు కార్పొరేషన్‌లో జారీ చేసిన టీడీఆర్ బాండ్లు:

సంవత్సరం	టీడీఆర్ బాండ్లు
2019	13
2020	15
2021	52
2022	31
2023	24
మొత్తం	135

కర్నూలులో 135 టీడీఆర్ బాండ్లు జారీ:

గత వైసీపీ ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్ల జారీపై రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఆరోపణల వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా కర్నూలు కార్పొరేషన్ ద్వారా టీడీఆర్ బాండ్లు ఏమైనా జారీ చేశారా..? అని అప్పటి కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళితే.. అలాంటి బాండ్లు జారీ చేయలేదు. పెద్దపెద్ద మెట్రోపాలిటీ నగరాల్లో వీటిని జారీ చేస్తారని ఏడాది క్రితం వివరించారు. ప్రభుత్వం మారింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. టీడీఆర్ బాండ్ల జారీపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సై అనడంతో కర్నూలు నగర పాలక సంస్థ 135 టీడీఆర్ బాండ్లు జారీ చేసిందని, ఏ వ్యక్తి పేరిట ఈ బాండ్ ఇచ్చారు, టీడీఆర్ సర్టిఫికెట్ నంబరు, జారీ చేసిన తేదీ, సర్వే నంబరు, వార్డు నంబరు, ఇంటి నంబరు, ఎంత విస్తీరణ స్థలం నగర పాలికకు స్వాధీనం చేశారు, ఎంత విస్తీర్ణం టీడీఆర్ ఉపయోగించుకుంటారు.. ఇలా సమగ్ర వివరాలతో టీడీఆర్ వివరాల జాబితా నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులకు రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టరు పంపించారు. 2019 జనవరి నుంచి 2024 జూన్ వరకు కర్నూలు నగర పాలక సంస్థ 135 బదిలీ చేయదగిని అభివృద్ధి హక్కులు (టీడీఆర్) జారీ చేసింది. అందులో గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2019 మార్చి 20న ఒక టీడీఆర్ జారీ చేశారు. అది కూడా ఎన్నికల సమయం. వైసీపీ అధికారంలోకి వచ్చాక 134 టీడీఆర్ బాండ్లు జారీ చేయడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అందులో కార్పొరేషన్ మేయర్ బీవై రామయ్య బాధ్యతలు చేపట్టాకే వందకు పైగా జారీ చేసినట్లు తెలుస్తోంది. సుంకేసుల రహదారిలో తుంగభద్ర నదీతీరంలో ఓ భూ యజమానికి నుంచి రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కోసం ఓ బిల్డర్ కొంత భూమిని తీసుకున్నారు. డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ మాత్రం రాసుకున్నారు. ఆ బిల్డరుకు ఎలాంటి భూ హక్కులు లేవు. పైగా అగ్రిమెంట్ గడువు కూడా తీరిపోయిన తరువాత.. ఆ బిల్డర్ పార్కు డెవలప్‌మెంట్ కోసం కొంత భూమి ఇచ్చాడని, ఆ భూమికి బదులుగా దాదాపు రూ.13 కోట్లకుపైగా విలువైన టీడీఆర్ బాండ్లు ఇచ్చినట్లు సమాచారం. ఈ భూమి కూడా తుంగభద్ర నది బఫర్ జోన్ పరిధిలోని భూమి అని పక్కా రికార్డులు ఉన్నాయి. నగర పాలక అధికారులు, పాలకులు కాసులకు కక్కుర్తిపడి ఇష్టారాజ్యంగా టీడీఆర్ ఇచ్చారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేస్తే భారీ కుంభకోణం వెలుగు చూస్తుందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు నిబద్ధత, నిజాయితీతో విచారణ చేస్తారా..? రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి నామమాత్రపు సర్వేతో సరిపుచ్చుతారా..? అన్నది తేలాల్సి ఉంది.

పెండింగ్ బిల్లులపై నేడు అత్యవసర సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 25: పెండింగ్ బిల్లులపై గురువారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత బుధవారం గుంటూరులో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఇంజనీరింగ్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతున్న మార్కెట్ యార్డులో పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించేందుకు డైరెక్టర్ విజయ సునీత మొదటి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. కర్నూలు మార్కెట్ యార్డులో కమిషన్ ఏజెంట్లకు సంబంధించిన షాపుల నిర్మాణంతోపాటు రూ.6 కోట్లతో నిర్మిస్తున్న జంబో ప్లాట్‌ఫారం నిర్మాణాలు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల డైరెక్టర్ విజయ సునీత, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో పర్యటించి నిలిచిపోయిన పనుల వల్ల రైతులు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో స్వయంగా పరిశీలించారు.

రైతులు డ్రిప్ పరికరాలను అందుకోండి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 25: ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రిప్ పరికరాలు అందించేందుకు నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, బోర్లు కలిగి ఉన్న రైతులు నీటి పొదుపు కోసం పంటల సాగును డ్రిప్ ఏర్పాటు ద్వారా ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగు చేయవచ్చని అందువల్ల రైతులు డ్రిప్ పరికరాల ఏర్పాటు కోసం గ్రామాల్లోని రైతు సలహా కేంద్రాలతో పాటు తమ కార్యాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఎక్సైజ్ డీసీగా శ్రీదేవి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 25: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఉమ్మడి కర్నూలు, నంద్యాల డిప్యూటీ కమిషనర్‌గా శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ డా హనుమంతరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు సూపరింటెండెంట్‌గా కర్నూలులో యథావిధిగా సుధీర్ కుమార్ కొనసాగించింది. నంద్యాల సూపరింటెండెంట్‌గా ఎస్ రవికుమార్‌ను నియమించింది.

హామీలను మరిచిన ప్రభుత్వం: కాంగ్రెస్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25: ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం మరిచిందని నంద్యాల పార్లమెంట్ డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడంపై ఆయన స్పందించారు. వంద రోజుల్లో సామాజిక పెన్షన్ల పెంపు మినహాయిస్తే సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన పథకాలను విస్మరించిందని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట గరిటె, స్టీల్ ప్లేట్లతో శబ్దం చేస్తూ నిరసన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల మేరకు సామాజిక పెన్షన్లు పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందని అది మినహా ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. యువగళం కింద నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్, ప్రతి ఇంటికీ ఏడాది ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించిందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను వీలైనంత త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించాలి

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్వచ్ఛతా హీ సేవ, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాల నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి ప్రణాళికలను మొక్కుబడిగా కాకుండా తాగు నీరు, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పన, తదితర అన్ని అంశాలను క్రోడీకరించి రూపొందించాలని అధికారులను సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 4,876 కార్యక్రమాలు జరిగాయన్నారు. జిల్లాలో 567 గ్రామసభలు నిర్వహించామని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్‌లతో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మళ్లీ పతనం దిశగా పత్తి ధర

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 25 : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు మూడో రోజు మళ్లీ పతనం అయ్యాయి. బుధవారం పత్తి ధర గరిష్ఠంగా క్వింటం రూ.7561 పలికింది. వారం రోజుల్లోనే పత్తి ధర క్వింటానికి రూ.800పైగా ధర తగ్గింది. ఖరీఫ్ సీజన్ పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటసాగు ఖర్చులు కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 15రోజుల కిందట రూ.8300పైగా పలికిన ఊరించిన ధరలు పతనం దిశగా కొనసాగుతుండడంతో రైతులు సాగు పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేపరిస్థితి కనిపించడం లేదని అప్పులే మిగులుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజల ధరలు దూది ధరలు పతనం కావడమే స్థానిక మార్కెట్ యార్డ్‌లో ధరల పతనానికి కారణమని చెబుతున్నారు. 8016 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,211, గరిష్ఠ ధర రూ.7,561 మధ్యస్థ ధర రూ. 7,389 పలికింది.

అందరి సహకారంతోనే అవినీతి అంతం

సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్



మాట్లాడుతున్న ఆర్పీ పట్నాయక్, బక్కని నర్సింహులు



ఉద్యోగులను సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 25: అందరి సహకారంతోనే అవినీతి రహిత సమాజం సాధ్యమని సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ప్రైవేటు హోటల్‌లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్(యాక్) ఆధ్వర్యంలో నిజాయితీ ఉద్యోగులను సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ అవినీతిపరుల్లో ఎప్పుడూ అభద్రత భావం ఉంటుందని, స్వేచ్ఛగా జీవించలేరన్నారు. నిజాయితీపరులు గర్వంగా నలుగురికి ఆదర్శంగా సమాజంలో బతుకుతారని, వీరిని చూసి అవినీతిపరుల్లో కొంతైన మార్పు వస్తే మెరుగైన సమాజం సాధ్యపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరైనా తమకు అప్పగించిన బాధ్యతలను ఫలితం ఆశించకుండా అంకితభావంతో చేసినప్పుడే అవినీతి అంతమవుతుందని అన్నారు. ప్రధానంగా అవినీతిపై యువతలో పరివర్తన రావాలని, నిజాయితీపరుల సంఖ్య పెరగాలని, అప్పుడే మంచి సమాజ నిర్మాణం చేయవచ్చునని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ తప్పు చేస్తే ప్రశ్నించే తత్వం ప్రజల్లో రావాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించేవారు పరోక్షంగా అవినీతిని ప్రోత్సహించినట్లే అవుతుందన్నారు. నిజాయితీ ఉద్యోగులకు చేసే సత్కారం మరి కొందరికి స్ఫూర్తి కావాలన్నారు. నాయకుడు అనేవారు నిష్పక్షపాతంగా, న్యాయబద్ధ పాలన అందించినప్పుడే అవినీతిని నియంత్రించవచ్చునని తెలిపారు. యాక్ వ్యవస్థాపకులు పలనాటి రాజేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవకులు అని, వారి సేవలకు ప్రజలు కట్టే పన్నుల నుంచే జీతాలు చెల్లిస్తారని, అటువంటిది వారు లంచాలు ఆశించటం సరికాదన్నారు. తమ సంస్థ అవినీతిని ప్రశ్నిస్తోందని, నిజాయితీని గుర్తించి సత్కరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం తమ సంస్థలో 35 వేల మంది సభ్యులు ఉన్నారని, అవినీతి నియంత్రణపై ప్రజలను మరింత జాగృతం చేస్తామని పలనాటి రాజేంద్ర తెలిపారు. సమావేశంలో యాక్ ప్రతినిధులు డాక్టర్ స్రవంతి, ఆశోక్‌కుమార్, నారాయణ, విక్రం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పరుగులు: ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

పెద్దకడుబూరు, సెప్టెంబరు 25: సంక్షోభాంధ్రప్రదేశ్ నుంచి స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రం పరుగులు పెడుతోందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం పెద్దకడబూరులోని ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాగ్రహంతో వైసీపీ పాతాళానికి పడిపోయిందని అన్నారు. వైసీపీ అధినేత జగన్ తన ఎమ్మెల్యేలు, ఎంపీతలలకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా పరిపాలన చేశారని తెలిపారు. అదే సీఎం చంద్రబాబు ఎంపీలను దగ్గర కూర్చోబెట్టుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపాలని సూచిస్తున్నారని తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, మంత్రాలయం జనసేన ఇన్‌చార్జి లక్ష్మణ్, బీజేపీ నాయకుడు విష్ణు, మాజీ ఎంపీపీ నరవ శశిరేఖ, టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, మల్లికార్జున, హనుమంతు రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు ఏసేబు, విజయ్ కుమార్, వీరేష్ గౌడ్, బొగ్గుల బాషా, బొగ్గుల తిక్కన్న, సత్యన్న గౌడ్ పాల్గొన్నారు.

ఔషధ సృష్టికర్త ఫార్మాసిస్టే

కర్నూలు జీజీహెచ్‌లో ఘనంగా ఫార్మాసిస్టు డే

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 25: ఔషధ సృష్టికర్తలు ఫార్మసిస్టులేనని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రిలోని ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా డిస్పెన్సరీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో ప్రతిరోజూ 3,800 మంది ఓపీకి వస్తుంటారని, 1200 మంది అడ్మిషన్ పొందుతారని, వీరందరికి మందులు ఇచ్చే విషయంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు మందులను చాలా నమ్మకంతో వాడితే ఏ వ్యాధి అయినా త్వరగా నయమవుతుందన్నారు. మార్కె ట్‌లో వచ్చే ప్రతి మాత్ర ఎన్నో సంవత్సరాల పరిశోధనల తర్వాత బయటకు వస్తుందని తెలిపారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ఫార్మసిస్టు ఆఫీసర్ నరసింహారావును ఘనంగా సన్మానించారు. సీఎస్ ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, డ్రగ్స్ స్టోర్ మెడికల్ ఆఫీసర్ డా.శారద, ఫార్మాసిస్టులు కృష్ణ, మోహన్‌శర్మ, సత్యప్రసాద్, నరసప్ప, శ్రీనివాసులు, రాజేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఫుల్లు



- మామూళ్లు తీసుకోవడం.. పోస్టింగ్ మార్చడం
- జిల్లా రెవెన్యూ కార్యాలయం సిబ్బంది చేతివాటం
- అందులో భాగంగానే బదిలీల్లో మార్పులు చేర్పులు
- గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారికి పోస్టింగ్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: చీకటి బేరాలకు జిల్లా రెవెన్యూ కార్యాలయం కేంద్రంగా మారిందా.. అక్రమ బదిలీలకు అడ్డాగా తయారైందా.. రెవెన్యూ శాఖలో మంగళవారం జరిగిన పరిణామాలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. కలెక్టర్ రంజిత్‌కుమార్ బాషా ఈ నెల 21 తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోల బదిలీల ఆర్డర్స్ విడుదల చేశారు. అయితే వాటిని బేఖాతరు చేస్తూ జిల్లా రెవెన్యూ కార్యాలయంలో పని చేసే ఓ ముగ్గురు మార్పులు చేర్పులకు బరితెగించారు. డబ్బులు ముట్టజెప్పిన వారికి నచ్చిన స్థానాలను కేటాయిస్తూ ఆర్డర్స్‌ను మార్చేరు. ఈ బదిలీల మార్పు వెనకాల రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్కరి నుంచి రూ.నాలుగైదు లక్షల దాకా తీసుకున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది.

రూ.లక్షలు తీసుకొని మార్పులు చేర్పులు..!

కల్లూరు మండలంలో పని చేసిన సూరిబాబును అనుగొండకు బదిలీ చేయగా తిరిగి కల్లూరుకే కేటాయిస్తూ రెండో దఫా ఆర్డర్స్ ఇవ్వడంపై దుమారం రేగింది. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వీఆర్వోపై రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి ఎందుకు అంత ప్రేమ అన్న చర్చ నడుస్తోంది. డీటీల విషయంలోనూ ఇలాంటి మార్పులు చేర్పురే చేశారని తెలుస్తోంది. భారీగా మామూళ్లు పుచ్చుకొని ఈ బదిలీలకు తెగబడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కల్లూరు మండలంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన ఓ వీఆర్వోకు ఓర్వకల్లు మండలంలో పోస్టింగ్ ఇవ్వడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో పని చేసిన వారికే మళ్లీ..

కల్లూరు మండలంలో పని చేస్తున్న వీఆర్వో సూరిబాబును కోడుమూరు మండలం అనుగొండకు బదిలీ చేశారు. క్రిష్ణగిరి మండలం ఎర్రచెంచుగుడి వీఆర్వోగా పని చేస్తున్న మీసాల మద్దిలేటిని కల్లూరుకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఆర్డర్స్ ఈ నెల 21న విడుదల అయ్యాయి. అయితే వీటిని కాదని డీఆర్వో కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది మంగళవారం కొత్త ఆర్డర్స్‌ను రిలీజ్ చేశారు. అది కూడా ఈ ఇద్దరు వీఆర్వోలకు సంబంధించిన స్థానాలను మాత్రమే మార్చేశారు. ప్రత్యేకించి వీరిద్దని పిలిపించి ఆర్డర్స్‌ను చేతిలో పెట్టడం గమనించాల్సిన అంశం. జిల్లాలోని బదిలీలైన వీఆర్వోలందర్నీ కాదని వీరిద్దరికి మాత్రమే ఆర్డర్స్ మార్చి చేతిలో పెట్టడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 25 : మండల పరిధిలోని ముద్దనగేరి గ్రామానికి చెందిన బారిక హనుమంతు, గోవిందమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాసులు (25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి ముందు తాగునీరు పెట్టేందుకు మోటార్ వైరుకు స్విచ్ ప్లగ్ సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య రూప, కూతురు ఉన్నారు. శ్రీనివాసులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆరోగ్య స్వామి, గోపినాథ్ కోరారు.

నిందితుడికి జైలు

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 25: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు జూలాయిలు ఘర్షణ పడి హత్యకు దారి తీసిన ఘటనలో నిందితుడిపై నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి. దివాకర్ బుధవారం తీర్పు చెప్పారు. గత ఏడాది నవంబరు 29వ తేదీ రాత్రి స్థానిక టీవీ9 కాలనీకి చెందిన నిందితుడు బోయ నాగరాజు, ఉలిందకొండకు చెందిన మల్లెపోగు ప్రభాకర్ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో బోయ నాగరాజు ఎదపై కూర్చుని ప్రభాకర్ దాడి చేశాడు. ఆత్మరక్షణ కోసం నిందితుడు చేతికందిన ఇటుకతో తలపై మోదీ తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. దీంతో అక్కడే ఉన్న ఫిర్యాది సూర్యచంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ మురళీధర్ రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ హత్య ఉద్దేశపూర్వకంగా జరగలేదని, ఆత్మరక్షణ కోసం నిందితుడు చేసిన హత్యగా గుర్తించి నిందితునిపై ఆత్మరక్షణ కోసం చేసిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితుడు బోయ నాగరాజుపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. బాలరంగ స్వామి వాదించారు.

చిన్నమరివీడులో డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల, సెప్టెంబరు 25: మండల పరధిలోని చిన్నమరివీడు గ్రామంలో వెంకటేష్ అనే వ్యక్తికి డెంగీ సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. దీంతో బుధవారం గోనెగండ్ల వైద్యాధికారులు, మలేరియా అధికారి సాయిబాబా చిన్నమరివీడు గ్రామం చేరుకొని డెంగీ సోకిన వీధిలోని వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే గెంగీ సోకిన వ్యక్తి ఇంటి పరిసరాలలో దోమలు ప్రబలకుండా ద్రావణం పిచికారి చేయించారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని పలు వీధులలో మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుధాకర్, కృష్ణ, ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్‌సీ, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో పడి బాలుడి మృతి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 25: ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున, శారదమ్మలకు నలుగురు సంతానం కాగా, హర్షవర్ధన్ (6) అనే బాలుడు మూడవ సంతానం.

కాగా తల్లిదండ్రులు పనుల నిమిత్తం బయటకు వెళ్లినప్పుడు తన జేజీ రమణమ్మ వద్ద ఉంచేవారు. బుధవారం జేజీ రమణమ్మ వద్ద ఉన్న హర్షవర్ధన్‌ను ఉంచి తల్లిదండ్రులు పనులకు వెళ్లారు. ఆమె గొర్రెలను మేపేందుకు వెళ్లగా బాబు సమీప పంట పొలాల వద్దకు వెళ్లి కాలువలో పడి ఊపిరాడక మృతి చెందాడు. పిల్లవాడు కాలువలో ఉండటం గమనించిన స్థానిక రైతులు, ఆమె జేజీకి సమాచారం ఇచ్చి హుటాహుటిన గ్రామంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనతో రమణమ్మ అపస్మారనక స్థితిలోకి వెళ్లిపోగా ఆమెను హుటాహుటిన ఓ ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదవశాత్తు కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

వీధి బాలలను సంరక్షించాలి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 25: వీధి బాలలను గుర్తించి వారిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కోరారు. స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో అయన మాట్లాడారు. బాలల హక్కులను సంరక్షించాలని, తెలిసీ తెలియని వయస్సులో ఇళ్ల నుంచి వెళ్లిపోయి వీధి బాలలుగా మారి బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ, పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ సంస్థ అధికారులతో కూడిన మూడు బృందాలు వేర్వేరుగా నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి బాలలను గుర్తించడానికి వెళ్లాయని తెలిపారు. పోలీసులు, కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ శాఖలు వీధి బాలలను గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, దిశ డీఎస్పీ కే.శ్రీనివాసాచారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబ శివ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్ పర్సన్ జుబేదా బేగం పాల్గొన్నారు.

హెచ్ఎంను సస్పెండ్ చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన పెద్దకడుబూరులోని ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం డీఈవో శామ్యూల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ హెచ్ఎం సుప్రసాద్ తన మొబైల్ ఫోన్‌లో అసభ్యకరమైన వీడియోలు చూపిస్తూ లైంగికంగా వేధించడం బాధాకరమన్నారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అమర్ పాల్గొన్నారు.

● **పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో:** ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న ఆగడాలను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మహేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. బుధవారం డీఈవో కార్యాలయంలోని డీఈవో శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకుంద, లంకేష్, సుధాకర్, కేశవ్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: చైనా దేశంలోని కింగ్‌డావాలో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరిగిన ఆసియా బీచ్ సెపక్‌తక్రాలో పురుషుల విభాగంలో భారతజట్టు తరఫున కురువ మధు కాంస్యం పతకాన్ని సాధించాడు. బుధవారం జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో మధును సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కిష్టన్న, అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగ స్వామిలు అభినందించారు. కార్యక్రమంలో సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె శివన్న, మాజీ అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 25: నగరంలోని శరీన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కింద పారిశుధ్య కార్మికులకు వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి అక్టోబరు 2 వరకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్మికులకు 67 రకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం వారికి చికిత్స అందించి అవసరమైన వారికి కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తామన్నారు.

హామీలను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతులకు, ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తవుతు న్నా కూడా హామీలు అమలు చేయలేదని అన్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, మాసూంబాషా, బుగ్గరాముడు, వెంకటేశ్వర్లు, శివరాముడు, రామచంద్రుడు, దేవరాజు, ఆకుల మధు, శివకుమార్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఎన్నికల్లో అభ్యర్థుల వివరాలు వెల్లడి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 25: ఈనెల 29న నిర్వహించనున్న నగర బ్రాహ్మణ సంఘం ఎన్నికల్లో పోటీలో నిలబడిన అభ్యర్థుల వివరాలు బుధవారం సాయంత్రం సంఘ ఎన్నికల అధికారి గొబ్బూరి శేషాద్రి ఆదేశాల మేరకు సహాయ ఎన్నికల అధికారి సందేల్ చంద్రశేఖర్ వెల్లడించారు. సంఘ అధ్యక్ష స్థానానికి టీవీ రవిచంద్ర శర్మ, పసుపుల మురళీకృష్ణ, పి. సత్యప్రసాద్, మామిళ్లపల్లి రాజేశ్, జొన్నభట్ల సీతారామశర్మ, హెచ్ దేవీ ప్రసాద్, తంగిరాల రఘురామశర్మ, రెంటచింతల సుధాకర్ శర్మ పోటీకి నిలబడినట్లు తెలిపారు. అలాగే ఉపాధ్యక్షులుగా, మిగతా పోస్టులకు పోటీలో ఉన్న వ్యక్తుల పేరు ఆయన తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు, సెప్టెంబరు 25: అగ్నిమాపక సేవల శాఖ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా ప్రతాప్, జాయింట్ సహాయ కార్యదర్శిగా గోపాల్, ట్రెజరరీగా నాగరాజు, అడ్వైజర్‌గా శివ కుల్లాయప్పలను ఎన్నుకున్నారు.

ఏజీఎంసీగా నాయకల్లు సుంకన్న

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 25: గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్ ఇన్ లైబ్రేరియన్‌గా పని చేస్తున్న నాయకల్లు సుంకన్నను ఏజీఎంసీగా నియమితులయ్యారు. ఈ మేరకు కడప ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీవీఈవో పరమేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు.

వాలీబాల్, హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 25: స్థానిక అవుట్‌డోర్ డీఎస్ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్, హాకీ ఎంపిక పోటీలు బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా డీవీఈవో వై. పరమేశ్వరరెడ్డి, కేవీఆర్ ప్రిన్సిపాల్ లాలెప్ప, వాలీబాల్ క్రీడాకారులు జాఫర్ మున్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు క్రీడలకు ఒక గంట సమయం కేటాయించాలని అన్నారు.

మహిళా సాధికారత కేంద్రంలో చెట్ల తొలగింపు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 25: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మహిళా సాధికారతా కేంద్రం ఆవరణలో చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. కేంద్రంలో చెట్లు మొలిచి ఇబ్బందికరంగా ఉందని అధికారి అంజనీ భూషణ్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ తన సొంతడబ్బులతో చెట్లను తొలగిస్తానని హామీ ఇచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం ఉల్చాల గ్రామంలో బుధవారం అధికారులు నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే వందరోజుల పాలనలో రాష్ట్రంలో అనేక సమూల మార్పులు తీసుకొచ్చిందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్, పీఆర్ ఏఈ ముక్తార్‌భాష, ఈవోఆర్డీ అనూరాధ, టీడీపీ నాయకులు బుర్ర వెంకటేష్‌నాయుడు, రాఘవేంద్ర, ఎంపీటీసీ శివన్న పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి: సోమిశెట్టి

కర్నూలు(అర్బన్): టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని 45 వార్డు లేబర్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం కార్పొరేటర్ మాణిక్యమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం


కొల్లంపల్లి తండాలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రతి కుటుంబానికి సేవ చేయడంలో జవాబుదారీగా వ్యవహరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, ముంతాజ్, జయన్న పాల్గొన్నారు.

ఓర్వకల్లు: రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఓర్వకల్లులో గుట్టపాడులో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఓర్వకల్లు గ్రామ సచివాలయంలో జరిగిన సభకు ముఖ్యఅతిథిగా తహసీల్దార్ వెంకట రమణ హాజరయ్యారు. కూటమి వంద రోజుల పాలనపై ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లను అతికించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే గుట్టపాడు గ్రామంలో సర్పంచ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి సచివాలయంలో గ్రామ సభలో పాల్గొని ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు. నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నాగరాజు, సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిందని ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ.రమణ అన్నారు. బుధవారం కల్లూరు మండలం ఉలిందకొండ మజరా కొల్లంపల్లి తాండ గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించారు. ఈసందర్భంగా ఈవీ రమణ, హీరూనాయక్‌లు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలు అమలుకు చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగా పింఛన్ పెంపు, ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డీఎస్సీ వంటి నిర్ణయాలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్, విక్రమ్, నారాయణ, హీరూ నాయక్, శంకర్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి


మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు


ఓర్వకల్లు మండలం గుట్టపాడులో..

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ చేయండి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 25: ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో, బీఎల్‌వోలతో కమిషనర్, ఎంఆర్‌వో వెంకటలక్ష్మి వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించారు. పలు కేంద్రాలకు సంబంధించి మార్పు చేర్పులపై చర్చించారు. అనంతరం బీఎల్‌వోలకు ప్రత్యేక ఓటరు సవ రణపై అవగాహన కల్పించారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరిని నూతన ఓటరుగా నమోదు చేయడానికి ఇంటింటి సర్వే ప్రక్రియ నిర్వహించాలని, ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం 6ఏ, ఫారం 7, 8, 13,14లను దరఖాస్తులు త్వరగా పరిశీలన చేయాలని సూచించారు. ఆర్‌వో జునైద్, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ: నగర పాలక సంస్థ పరిధిలోని 71, 75వ సచివాలయాలను నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు బుధవారం తనిఖీ చేశారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది యూనిఫాం ప్రతి రోజు ధరించాలని, ఐడి కార్డులు వేసుకోవాలని సూచించారు.

● నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు నిర్వహించాలని


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కమిషనర్ రవీంద్ర బాబు ఆదేశించారు. బుధవారం నగరంలోనా రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వర నగర్, బాబా బృందావన్ నగర్, రాఘవేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కృష్ణారెడ్డి నగర్‌లో శిథిలావస్థకు చేరిన 200 కెఎల్ వాటర్ ట్యాంక్ పరిశీలించి, వెంటనే మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్ ఉన్నారు.

నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు అవకాశం కల్పించాలి

టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ వేమన్నగౌడ్


మాట్లాడుతున్న కేఈ వేమన్నగౌడ్

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 25: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నామి నేటెడ్ పదవులో సీనియర్ నాయకులకు అవకాశం కల్పించాలని కర్నూలు రూరల్ మండల టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ వేమన్నగౌడ్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం అయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలు అందిస్తున్నామని వివరించారు. జిల్లాల్లో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రతోపాటు నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన నిజం గెలవాలి కార్యక్రమంలో కూడ జనసమీకరించి తనవంతుగా పాల్గొన్నామన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేశానని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలో ఆయన అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఇప్పటికే మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీలు నాగరాజు, శబరి, ఎమ్మెల్యే లు బొగ్గుల దస్తగిరి, గౌరుచరిత, కేఈ శ్యామ్‌బాబు, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్తా జయసూర్య, కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి కర్నూలు, నంద్యాల టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్‌గౌడ్ పార్టీలో తనసేవలను గుర్తిం చి నామినేటెడ్ పోస్టును ఇవ్వాలని లేఖల ద్వారా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారన్నారు. రెండో విడతలో ఇచ్చే నామినేటెడ్ పదవుల్లోనైన తనతో పాటు సీనియర్లకు కూడా అవకాశం కల్పించాలని కేఈ వేమన్నగౌడ్ కోరారు.

క్రీడలతోనే భవిష్యత్తు


క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 25: క్రీడలతోనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. బుధవారం జిల్లా ఇంటర్ కళాశాలల బాలికల రగ్బీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేసేందుకు ఈ పోటీలను రగ్బీ అసోసియేసన్ ఏర్పాటు చేసింది. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిచాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకుడు రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు బాల సుబ్రహ్మణ్యం


బాల సుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 25: తెలుగు సినీ పరిశ్రమలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గాన గంధర్వుడుగా నిలిచిపోతారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. బుధవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత తెలుగు సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్థంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినీ సంగీత ప్రపంచంలో రారాజుగా వెలుగొందారని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు సీవీ రెడ్డి, రాజారత్నం, యాగంటీశ్వరప్ప, ఈశ్వరయ్య, లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ కొత్తది కొనుగోలు చేసి

బాగలేదని పాతది ఇచ్చిన యువతి

● కేసు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 25: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాతబస్తీలో అశ్విని అనే యువతి తమను మోసం చేసిందని ఇన్‌స్ట్రా కార్ట్ అనే సంస్థ ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఆ సంస్థ ప్రతినిధి కిరణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని టూటౌన్ పోలీసులను ఎస్పీ ఆదేశించారు. వివరాల్లోకి వెళితే గత కొద్ది రోజుల క్రితం అశ్విని అనే యువతి రూ.3.40 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసింది. ఆ సంస్థ నిర్వాహకులు ల్యాబ్‌టాప్‌ను డెలివరీ చేసింది. ఆ తర్వాత ల్యాబ్‌టాప్ పని చేయడం లేదంటూ ఆ యువతి తిరిగి రిటర్న్ ఆర్డర్ ఇచ్చింది. ఆ సంస్థ నిర్వాహకులు ల్యాబ్‌టాప్‌ను తీసుకెళ్లి ఆ యువతి నగదును అకౌంటులో చెల్లించారు. తీరా ఈ ల్యాబ్‌టాప్ డూప్లికేట్‌గా ఆ సంస్థ నిర్వాహకులు నిర్ధారించారు. ఆ యువతిని సంప్రదిస్తే అందుబాటులోకి లేకపోవడంతో ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు


క్విజ్ విజేతలతో డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 25: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ నగదు, ప్రశంసాపత్రాలను బుధవారం అందజేశారు. ఆగస్టు 24న ఐదు కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్ పోటీలు, ఈ నెల 11న హైస్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మారథాన్ పురుషులలో మొదటి బహుమతి డిగ్రీ కాలేజీకి చెందిన ఎ.దివాకర్, ప్రభుత్వ కాలేజ్ ఫర్ మెన్‌కు చెందిన జి. ప్రసాద్ రెండో బహుమతి, మహిళల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫర్‌మెన్ మల్లికాబాయి మొదటి బహుమతి, రవీంద్ర డిగ్రీ కాలేజీ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన డి.వెంకటేశ్వరి రెండో బహుమతి, ట్రాన్స్ జెండర్లలో జి. లీలావతి, జీ.కీర్తి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి బహుమ తులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

జాతీయ స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 25: ఈ నెల 26 నుంచి 29 వరకు తమిళనాడు చెంగల్‌పట్టులో జరగబోయే 18వ జాతీయ స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గెలిచి పతకాలతో తిరిగి రావాలని జిల్లా రోయింగ్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అరవింద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేసి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ విభాగంలో కే. అలేఖ్య, కే అఖిల, మోక్షిత, కే వీరేష్, కే కార్తిక్, జాహ్నవి, రజిత రాణి, ఈ. సాయి ప్రణవ్‌గౌడు, కుశల్ రెడ్డిలు ఎంపికయ్యారని అన్నారు.

ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్‌గా ఫైరోజ్



ఓర్వకల్లు, సెప్టెంబరు 25: ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్‌గా ఫైరోజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న జయవాణి బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలానికి బదిలీ కాగా, ఆమె స్థానంలో ప్యాపిలికి చెందిన ఫైరోజ్ ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. ఫైరోజ్‌కు కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంటు రైటర్లు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పొలాల్లో విద్యుత్ టవర్లు అన్యాయం

ఓర్వకల్లు, సెప్టెంబరు 25: గ్రామాల్లోని రైతుల పొలాల్లో విద్యుత్ టవర్లు ఏర్పాటు చేయడం అన్యాయమని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. బుధవారం ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగన్నాథంతోపాటు మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మండలంలో గ్రీన్‌కో సంస్థ విద్యుత్ టవర్‌లైన్ పొలాల్లో పోతుం దని అధికారులు, సర్పంచులు, రైతులకు తెలియకుండా ఎలాంటి గ్రామ సభలు జరపకుండా తీర్మాణాలు చేయకుండా టవర్లు ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. ఒక్కొక్క టవర్‌కు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వా లని, రైతుల పొలాల్లో విద్యుత్ లైన్లకు మీటరుకు రూ.10వేలు నష్టపరి హారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సుధాకర్, వెంకటేశ్వర్లు, అయ్యన్న పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది' వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఏడీఏ దస్తగిరి రెడ్డి

గూడూరు సెప్టెంబరు 25: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ దస్తగిరి రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బూడిదపాడు, కే.నాగులాపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వ ర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి రెడ్డి మా ట్లాడుతూ పంటల సాగులో సమస్యలను తెలుసుకుని రైతులకు పరిష్కారమార్గాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, వీఏఏలు భీమ్లా నాయక్, సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలు చేయాలి'

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 25: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ ఖాజాపాషా డిమాండ్ చేశారు. బుధవారం పాత నగరంలోని గడియారం ఆసుపత్రి వద్దగల సీఐటీయూ కార్యాల యంలో ఏర్పాటు చేసిన పెయింటర్ల యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గత జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు కాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, ఆమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే బోర్డు ఏర్పాటు చేసి కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెయింటర్స్ యూనియర్ కార్యదర్శి చాంద్‌బాషా, సీఐటీయూ అధ్యక్షుడు గౌస్ దేశాయ్, గౌస్, ఖలీల్, రఫీక్ సాహెబ్, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఫార్మాసిస్టులకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 25: ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల శాంతిరాం ఫార్మసీ కాలేజీలో ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఆసుపత్రుల ఫార్మసిస్టులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా నంద్యాల డీఎంహెచ్‌వోగా డా. వెంకట రమణ పాల్గొని ఫార్మాసిస్టుల సేవలను కొనియాడారు.

'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను సాధించాలి'




రైల్వే స్టేషన్ సమీపంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కల్లూరులో..

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 25: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధన దిశగా యువత ముందుకు పోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం నగరంలోని 46వ వార్డు రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా బీజేపీ నాయకుడు కోటీ యాదవ్, జిల్లా బీజేపీ కోశాధికారి లోకేశ్వరయ్య, నాయకులు శివగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు పట్టణంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. బుధవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, మండల అధ్యక్షుడు గోరంట్ల ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కల్లూరు: కల్లూరు అర్బన్‌లో పండిట్ దీన్‌దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో కల్లూరు అర్బన్ అధ్యక్షుడు గంగాధర్ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు కొట్టి చెన్నయ్య పాల్గొన్నారు.

ఐదేళ్ల ప్రణాళికను సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సలీంబాషా

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 25: ఐదేళ్లకు సరిపడే అభివృద్ధి ప్రణాళికను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేయాలని ప్రత్యేక అధికారి సలీంబాషా తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీడీవో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు తదితర శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లకు సరిపడ అభివృద్ధి పనులపై అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు న్యాయం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 25: విద్యుత్ సంస్థను నమ్ముకొని గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కు న్యాయం చేయాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నరసింహారెడ్డి కోరారు. బుధవారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఉరుకుందు, భీమేష్ కుమారస్వామి, కిరణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 25 : బసాపురం రోడ్డులోని ధారాశ్రీ ప్రెస్సింగ్ అండ్ జీన్నింగ్ ఫ్యాక్టరీలో కాటన్ బెళ్లను లారీలో లోడు చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన కార్మికుడు రామకృష్ణ కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని ఏఐయఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగన్న ప్రజాసంఘాల నాయకులు సుజ్ఞానమ్మ, బసాపురం లింగన్న, దత్తు డిమాండ్ చేశారు. రామకృష్ణకు భార్య నలుగురు పిల్లలు ఉన్నారని, ఆ కుటుంబానికి రూ.పది లక్షలు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి



ర్యాలీగా వస్తున్న విద్యార్థినులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 25 : ప్రభుత్వ బీసీ కళాశాల హాస్టల్‌ను చదువుకుంటున్న జూనియర్ కళాశాల సమీపంలోనే ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనపురం ఉదయ్ డిమాండ్ చేశారు. బుధవారం బీమాస్ కూడలిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ మండిగిరి పంచాయతీలోని బీసీ హాస్టల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలంటే మూడు కిలోమీటర్ల పైగా నడిచి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రధాన రహదారులు ట్రాఫిక్‌ను దాటుకొని రావడానికి బాలికలు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. కళాశాల ఆవరణలో కొత్తగా పక్కా భవనాన్ని నిర్మాంచాలి లేదా, సమీపంలో అద్దె భవనంలోనైనా హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘు, నవీన్, వరుణ్ తేజ్, కిరణ్, విక్రమ్ పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన స్థలాన్ని ఆక్రమించారు



మాట్లాడుతున్న ఈడిగ చంద్రశేఖర్ గౌడు

మద్దికెర, సెప్టెంబరు 25: మద్దికెర గ్రామంలో రూ. కోటి విలువ చేసే స్థలాన్ని అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై సమావేశాన్ని సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఉమాదేవి, మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ సాధికారత కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణనాయకులు చంద్రమోహన్, గొడుగు సతీష్ కుమార్, జంబునాథ్ రాయుడు, వెంకట్రాయుడు, గద్దం రామాంజులు, గద్దం మల్లికార్జున, గుడి ఎల్లప్ప, ఎంపీడీవో సువర్ణలత పాల్గొన్నారు.

టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి

తుగ్గలి, సెప్టెంబరు 25: టీడీపీ ప్రభుత్వంతోనే గిరిజనులు అభివృద్ధి చెందుతారని సర్పంచ్ శంకరమ్మ, టీడీపీ గిరిజన జిల్లా నాయకులు రామూ నాయక్ అన్నారు. బుధవారం మీటేతాండలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు శంకర్ నాయక్, తిరుపాల్ నాయక్, విజయ నాయక్ తదితరులు ఉన్నారు.

పప్పు శనగ విత్తనాలు పంపిణీ చేయాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 25 : ప్రభుత్వం రైతులకు 50శాతం సబ్సిడీ పప్పు శనగ నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, సీపీఎం నాయకులు కేపీ నారాయణ స్వామి, షాకిర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ గోవిందు సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం, సీఐటీయూ నాయకులు, క్రిష్ణ, రవమేష్ గౌడ్, శేకన్న, రామంజి పాల్గొన్నారు.

దాసరి కులస్థులకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వొద్దు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న జైభీమ్, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులు

మంత్రాలయం, సెప్టెంబరు 24: మండలంలోని మాలదాసరి, దాసరి కులాలకు ఎస్సీ కుల సర్టిఫికెట్లు ఇవ్వొద్దని జైబీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జిల్లా కార్యదర్శి రత్నం, మాలమహానాడు జిల్లా నాయకులు నరసన్న డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. దాసరి కులానికి ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వద్దని ధర్నా చేసి డీటీ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జైబీమ్ ఎమ్మార్పీఎస్ నాయకకులు మారెన్న, నాగేంద్ర గర్జి ప్రకాష్, అజయ్ నరసింహులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 25: ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆర్పీఎస్ఎఫ్, ఆర్‌యుఎస్ఎఫ్ నాయకులు షాహిద్ ఆఫ్రిది, రఘునాథ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో సీఐ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కళాశాలలో దాదాపు 150 మంది విద్యార్థులు బస్సు పాసులు కట్టడంజరిగిందన్నారు. అయితే సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే ఆర్టీసి అధికారులు స్పందించి సరైన సమయంలో బస్సును నడపాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, మాలిక్, శివ, మధు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: ఒకరికి గాయాలు

వెల్దుర్తి, సెప్టెంబరు, 25: పట్టణంలో జీన్ రైల్వే గేట్ల సమీపంలోని జాతీయ రహదారి-44 దాటుతున్న ద్విచక్ర వాహనదారుడిని గుర్తుతెలియని వాహనం బుధవారం సాయంత్రం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మండలంలో యాదరాళ్ల గ్రామానికి చెందిన సుంకన్న (65) గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గోనెగండ్ల, సెప్టెంబరు 25: రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను టీడీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని వాటిని ఉపయోగించుకొని రైతులు అభివృద్ధి పథంలో నిలవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ మండల వ్యవసాయశాఖ అధికారి హేమలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నమరివీడు, పెద్ద మరివీడు గ్రామాలలో పంట పొలాలలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు25: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో ఆయన మాట్లాడుతూ యువతకు, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యంమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ జాబ్‌మేళాను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే వచ్చేనెల 4న ఎమ్మిగనూరులో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. దాదాపు 810 ఉద్యోగా లు ఉంటాయని, 10 పెద్దకంపెనీలు జాబ్‌మేళాలలో పాల్గొంటాయన్నారు. జాబ్‌మేళాలలో ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.32వేల వరకు నెలస రివేతనం లభిస్తుందని తెలిపారు. 7వ తరగతిపైన చదివన వారంతా ఈ జాబ్‌మేళాలలో పాల్గొని ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవాలన్నారు. అలాగే జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. హజ్‌యాత్రకు రూ.1లక్ష, ఇమాం, మోజాంలకు గౌరవ వేతనం ఇవ్వడం హర్షణీయమన్నారు.

● ఎమ్మిగనూరు కో-ఆపరేటీవ్ స్టోర్స్ నామినేటెడ్ బాడీని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం ప్రకటించారు. సొసైటీ చైర్మన్‌గా గట్టు అల్తాఫ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే సభ్యులుగా సోగనూరు వాల్మీకి రాఘవేంద్ర, వడ్డె రవి, లక్ష్మన్నలను ఎంపిక చేశామన్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి న్యాయవాదులు, ముస్లిం మైనార్టీలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు దేశాయ్‌మాదవరావ్, హాజీ బడేసాబ్, షాబీర్, ముల్లాఖలీముల్లా, కాశింవలి, రాజేంద్ర, రైస్‌మిల్ నారాయణరెడ్డి, బందెనవాజ్, సలీం, గట్టు సలాం, న్యాయవాదులు రషీద్, రామకృష్ణనాయుడు, గురుప్రసాద్, నర్సిరెడ్డి, సల్మాన్, ఓ.నారాయణయాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ప్రజ్వల జ్యోతి వెలిగించి వాలిబాల్ క్రీడతో పోటీలను ప్రారంభించారు, పోటీలలో వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్‌రావు, చిత్రలేఖ,ప్రసాద్, అస్లాం,శ్రీనివాసులు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల, మేకల పెంపకందారుల ఎన్నికల్లో పోటీ చేస్తాం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 25: వచ్చేనెల 22న జరిగే గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం ఎన్నికల్లో ఏపీ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం నుంచి 12 మంది పోటీ చేస్తారని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, అధ్యక్షుడు రాముడు తెలిపారు. బుధవారం పట్టణంలోని సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గొర్రెల, మేకల కాపరుల వృత్తిదారుల సంక్షేమం కోసం గతంలో ఉన్న చైర్మన్ చేసిందేమిలేదన్నారు. ప్రతియేడాది కేంద్రం నుండి ఎన్‌సీడీసీ కింద సంఘం కాపరుల సంక్షేమం కోసం రూ.24కోట్లు విడుదలైతే వాటిని వినియోగించుకోలేదని ఆరోపించారు. గొర్రెల షెడ్ల కోసం సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్నా వాటి బకాయిలు ప్రభుత్వాలు ఇవ్వకుండా చేతులెత్తేశాయన్నారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లేష్, సభ్యులు నాగరాజు, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా పాల్గొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

పెద్దకడుబూరు,సెప్టెంబరు 25: పెద్దకడబూరులోని ఆది ఆంధ్ర పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ ఎం సుప్రసాద్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు అసభ్యకర వీడియోలను చూపిస్తున్నందుకు ఆయన పోక్సో కేసు నమోదు అయిన విషయం విదితమే. అయితే దీనికి స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయనపై సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రథాలను భద్రంగా ఉంచుకోండి

మంత్రాలయం, సెప్టెంబరు 25: మంత్రాలయం రాఘవేంద్రస్వామి రథంతో పాటు కల్లుదేవకుంటు, సూగూరు, బూదూరు తిమ్మాపురం, వగరూరు, చిలకలడోన గ్రామాల్లో రథోత్సవాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని, ఇందు కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గ్రామాల్లోని నిర్వహించే రథాలకు రాత్రి, పగలు వేలలో రథాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గత రెండు రోజుల క్రితం అనంతపురంలో జరిగిన రథం దగ్ధంపై దృష్టి పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు.

మహిళ అరెస్టు

ఆదోని రూరల్, సెప్టెంబరు 25: బసాపురానికి చెందిన పార్వతిని ఇస్బీ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గ్రామ శివారుల్లో సదరు మహిళ నాటుసారాను విక్రయిస్తుండగా, అదుపులో తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

పత్తికొండలో జన సైనికుల పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 25: జనసేన పార్టీ వ్యవస్థాపకులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా పత్తికొండలో బుధవారం జనసేన సైనికులు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ ఇన్‌చార్జి రాజశేఖర్, జన సైనికులు సౌజన్య, ఇస్మాయిల్, వీరేష్, అనిల్, విజయకుమార్, రాజు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో డీసీహెచ్ విచారణ

ఎమ్మిగనూరు టౌన్,సెప్టెంబరు 25: ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో ఇటీవల వైద్యుల మధ్య జరిగిన వివాదంపై డీసీహెచ్ మాధవి బుధవారం విచారణ చేపట్టారు. వైద్యులందరితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుల మధ్య జరిగిన వివాదం సీఎంవోకు ఫిర్యాదు వెళ్లడంతో సీఎంవో ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్న వారిని పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న మీనాక్షి నాయుడు

ఆదోని, సెప్టెంబరు 25 : ఆదోని పట్టనంలోని 19వ వార్డ్ మండగిరి కాలనీకి చెందిన శ్రీనివాస్ ఆచారి ఆధ్వర్యంలో 50 కుటుంబాలకుపైగా వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు టీడీపీ కండవాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. రహిమాన్, బాలు లక్ష్మణ్, పవన్, సూరిలతో పాటు మరికొందరు ఉన్నారు. మీనాక్షి నాయుడు మాట్లాడారు. టీడీపీ బడుగుల ప్రభుత్వమని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో 19వ వార్డు టీడీపీ నాయకులు ధర్మరవి, వెంకటేష్, సంధ్యారాణి, సుధా, ముని పాల్గొన్నారు.

గ్రామాల్లో పనులు... పట్టణంలో జియోట్యాగింగ్‌లు

● వైసీపీ పాలనలో అధికారుల ఆగడాలు

● 15వ ఆర్థిక సంఘం నిధులు గోల్‌మాల్ చేశారా..?

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 25: మండలంలోని ఏ గ్రామంలో పనులు చేస్తే ఆ గ్రామంలోనే జియోట్యాగింగ్‌లు చేయాలి. కానీ గ్రామాల్లో జరిగిన పనులకు పట్టణాల్లో కూచొని అధికారులు జియోట్యాగింగ్ చేస్తున్నారు. కాంట్రాక్టర్లు ఎక్కడ అభివృద్ధి పనిచేసినా అధికారులకు అక్కడికి వెళ్లి పనుల నాణ్యతను గమనించి అన్ని సక్రమంగా ఉన్నాయా..లేదా పనులు పూర్తయ్యాయా..లేదా అన్న విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. బిల్లు పెట్టే సమయంలో ఎక్కడ పని జరిగి ఉంటే అక్కడే జియోట్యాగింగ్ చేసి బిల్లులు చేయాలి. అయితే పార్లపల్లి పంచాయతీలో మాత్రం అధికారులు నిబంధనలు తుంగలో తొక్కారు. పార్లపల్లి గ్రామం లో పనిచేయని ఓ బోరు వేసి దానికి మోటారు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు బిల్లు చేశారు. ఈ బోరుకు పట్టణంలోని కలుగొట్ల రోడ్డులోని ప్రధాన రహదారి పక్కలో ఉన్న పొలంలో సాగుబోరుకు జియోట్యాగింగ్ చేసి బిల్లు చేయడం గమనార్హం. అలాగే పార్లపల్లి, గువ్వలదొడ్డి గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలకు సైతం పట్టణంలోని ఎస్సీకాలనీలో ఉన్న సిమెంట్ రోడ్లుకు జియోట్యాగింగ్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా తూతూ మంత్రంగా పనులు చేసి బిల్లు లు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులను అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కలిసి దుర్వినియోగం చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముగిసిన క్రీడా పోటీలు

పత్తికొండ, సెప్టెంబరు 25 : పత్తికొండ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఆర్డీవో రామలక్ష్మి, వైద్యాధికారి కల్పన, సీఐ జయన్నలు ముగింపుకార్యక్రమంలో పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గెలుపుఓటములు క్రీడల్లో సర్వసాధారణమన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పెద్దకడుబూరు,సెప్టెంబరు 25: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆదోని రెండో అడిషనల్ మెజిస్ట్రేట్ శ్రీవల్లి అన్నారు. పెద్దకడబూరులోని బస్టాండ్ ఆవరణలోని బుధవారం న్యాయ విజ్ఞాన అవగహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల కార్మిక నిషేధ చట్టం, ఎస్సీ, ఎస్టీ, పీవోపీ, పోక్సో చట్టం, సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయం పొందే విధానం, అరెస్టు అయిన ముద్దాయికి ఉండే హక్కులు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో యస్ఐ నిరంజన్ రెడ్డి, లీగల్ ఎయిడ్ సెల్ అడ్వకేట్స్ శ్రీనివాసులు, లోకేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా

కోసిగి, సెప్టెంబరు 25: కోసిగి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా అన్నారు. బుధవారం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వీరేష్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండటంతో, అక్షరాస్యతను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మించాలని అన్నారు. నవంబరు 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు జయప్రదం చేయాలన్నారు.

● ఏఐఎస్ఎఫ్ కోసిగి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా విజయ్, ఉపాధ్యక్షులుగా శివ, ముస్తఫా, మల్లేష్, శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శిగా అంజి, సహాయ కార్యదర్శులుగా దివాకర్, జాఫర్, బాస్కర్, మహిళా కన్వీనర్‌గా వరలక్ష్మి, కో కన్వీనర్‌గా రాజేశ్వరి, వీరితో పాటు మరో 19 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

మద్దికెర, సెప్టెంబరు 25: స్థానిక రామ్‌నగర్ కాలనీలో వారం రోజులుగా తాగునీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నామని, నీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను కాలనీవాసులు మంగళి సోము, వీరేష్, గణేష్, రమేష్, రాము కలిసి వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వరద బాధితులకు ప్రతిభ పాఠశాల చేయూత



విరాళాలను బ్యాంకు అధికారులకు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

కౌతాళం, సెప్టెంబరు 25: విజయవాడ వరద బాధితులకు కౌతాళంలోని ప్రతిభ హై స్కూల్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది చందాలు సేకరించి వచ్చిన నగదును డీడీ రూపంలో బుధవారం బ్యాంకు అధికారికి అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా మాట్లాడుతూ రూ.50వేలు సేకరించామని తెలిపారు. ఆ నగదును వరద బాధితుల నిధి కింద డీడీ తీసి కెనరా బ్యాంకు అధికారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు షైనూ, భీమేష్, ఈరన్న, శిరీష, జయలక్ష్మి ఉన్నారు.

ఎడవలిలో పట్టపగలు చోరీయత్నం

మద్దికెర, సెప్టెంబరు 25: మండలంలోని ఎడవలి గ్రామంలో పట్టపగలే ఓ ఇంట్లో దొంగతనానికి దొంగలు ప్రయత్నించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామంలోని రంగన్న, శాంతమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. దొంగలు ఇంటికి తాళాలు తీసి ఇంట్లోకి దూరేందుకు ప్రయత్నిస్తుండగా అటుగా వెళ్తున్న సమీప బంధువులు ఎవరు అని ప్రశ్నించడంతో సమాధానం చెప్పకుండానే ద్విచక్ర వాహనంలో పరుగులు తీశారు. బాధితుడు రంగన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారిస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన నాయకుడు మల్లప్ప

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 25 : విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం మున్సిపల్ క్రీడామైదానంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. బాలికల కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని జనసేన నాయకుడు మల్లప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ శాంత, టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు గుడిసె ఆది కృష్ణమ్మతో కలిసి ఆడారు. సాయంత్రం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, సెటిల్ బ్యాట్మింటన్‌లో రాణించిన బాలికల జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ నరసయ్య రామన్న మున్సిపల్ హై స్కూల్ హెచ్‌ఎం మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ హెచ్‌ఎం హలీం సిద్ధికి, వ్యాయామ ఉపాధ్యాయులు ముజాహిద్, కళ్యాణ్ రావు, పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ నాయకులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 25: వరద బాధితుల సహాయార్థం ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.1లక్షను విరాళాన్ని ప్రకటించారు. బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని కలిసి రూ.1లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ వీవర్స్ అధ్యక్షులు నజీర్, రామలింగప్ప, టీడీపీ నరసప్ప, మోనె వెంకటేష్, బుగిడె పరమేషప్ప, బుగిడె ఈరన్న, పి.జి నరసన్న, మంజునాథ్ పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

నందవరం, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజా పాలన ఎలా ఉండాలో చేసి చూపించిందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇబ్రహింపురం, కొట్టాల, నదికైరవాడి, కిత్తకైరవాడిలో 100 రోజుల టీడీపీ పాలనా ప్రగతిపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ఇది మంచి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల దేశాయి మాదవరావు, పుష్పావతి, బండేగురుస్వామి, గురురాజారావు, కాశీంవలీ, దర్మాపురం గోపాల్, నారాయణరెడ్డి, ఈరన్నగౌడు, డీవీ రాముడు, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ నరసప్ప, నదికైరవాడి వీరేష్ ,డీలర్ బజారి, వీరారెడ్డి, శంకరమ్మ, పిఆర్ డీఈ చంద్రశేకర్, ఎంపీడీవో దశరథరామయ్య, ఏఈలు ప్రసాద్, జయన్న,ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేవనకొండ: రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. వంద రోజుల కూటమి ప్రజాపాలన కార్యక్రమాన్ని స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని



తుగ్గలి మండలం ఉప్పర్లపల్లిలో...

జనసేన నాయకుడు వెంకప్ప, బీజేపీ నాయకుడు వెంకట్రాము డు అన్నారు. అప్పులభారంతో మండలంలో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.28 లక్షల చెక్కును వీరభద్రగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బడిగింజల రంగ న్న ,మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సూభాన్, వెంకటస్వామిగౌడ్, వీరేష్ ,భాస్కర్, మలకన్న పాల్గొన్నారు.


కోసిగి: రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు పెండ్యాల భరద్వాజశెట్టి, పంపాపతి, కొండగేని వీరారెడ్డి, మాదేవ అన్నారు. కోసిగిలోని 9వ వార్డు రామక్కదేవాలయం, ఎన్టీఆర్ నగర్, శ్రీరామ్‌నగర్‌లో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, పంచాయితీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు వీరారెడ్డి, ఉమర్, మారెప్ప, ఎంపీటీసీ రాజు, నరసింహులు పాల్గొన్నారు.

తుగ్గలి: టీడీపీ ప్రభుత్వంతోనే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతాయనీ టీడీపీ సీనియర్ నాయకులు అప్పా వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లి, మీటేతాండ, సూర్యతాండ గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ అందిస్తున్న పథకాలను వివరిస్తూ వైసీపీ చేసిన అరచాకలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారులు ప్రణిత, రాధాకృష్ణ, టీడీపీ నాయకులు రాము నాయక్, శంకర్ నాయక్, విజయ నాయక్, విశ్వనాథ్, మనోహర్, లక్ష్మా నాయక్, విజయ్, టీఏలు ఫరీదప్ప, జయరాం తదితరులు ఉన్నారు.

ఆస్పరి: మండలంలోని నగరూరు, చిరుమాం దొడ్డి, పుటకలమర్రి గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు సావిత్రమ్మ, సుంకర నాగమ్మ, విశాలాక్షి, విజయ్ గోపాల్, రాజకుమార్, బద్రి, మల్లికార్జున రెడ్డి, మహానంది, రాఘవేంద్ర, శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోని: ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి ప్రజా సమస్యలను తెలుసుకున్నానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం పట్టణంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా ఎమ్మెల్యే పార్థసారథి కాలనీలో ఎదుర్కొంటున్న సమ స్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు.

మంత్రాలయం: సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని, గ్రామాలను అభివృద్ధి



దేవనకొండలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్



కోసిగిలో పాల్గొన్న టీడీపీ నాయకులు, అధికారులు



మాధవరంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు



ఆదోనిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

చేసేందుకు పోటీ పడుతున్నారని మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకుడు రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం గ్రామ సెక్రటరీ గోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని మాదవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వడ్ల విజయ్ కుమార్, అగ్రిగోల్డు ఉరుకుందు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్, ఆలాంబాషా, బూదురెడ్డి, నక్కల రమేష్, ఆదెన్న, వీరేష్, నరసింహులు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.